ముసిరిన మబ్బులతో రైతుల్లో గుబులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పలు గ్రామాలలో శనివారం సాయంత్రం ఒకసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. సాయంత్రం ఐదు, ఆరు గంటల మధ్యలో ఆకాశంలో నల్లని మబ్బులు అలముకున్నాయి. శుక్రవారం రాత్రి చిరుజల్లులు కురిసినప్పటికీ, పెద్ద వర్షం కాకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే శనివారం ఒకసారిగా వాతావరణంలో మార్పు కనిపించడంతో దిగులు మొదలైంది. దీని కారణం రాష్ట్రంలో పలుచోట్ల అకాల వర్షాలు పడటం, ఆ ప్రభావం ఇక్కడ చూపుతుందేమోనన్న దిగులు రైతుకు మొదలైంది. ఈ పరిస్థితిపై కౌలు రైతు కొనకళ్ల రామాంజనేయులు మాట్లాడుతూ, చేతి కందొచ్చిన పంట వర్షార్పణం అవుతుందేమోనన్న దిగులు మొదలైందని, మరో 10, 15 రోజులు వాతావరణం అనుకూలిస్తే రైతు ఒడ్డున పడతాడని తెలిపారు.

వేసవిలో ఇంటర్ క్లాసులు..!

- విద్యార్థుల అవస్థలు
- కార్పొరేట్ అనుకూల సంస్కరణలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎండలు మండిపోతున్నాయి. 38 నుంచి 40 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో భానుడు మరింత తీవ్ర రూపం దాల్చి ప్రతాపం చూపే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఎండలకు పలు జాగ్రత్తలు అవసరమని వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులు సూచనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా విద్యార్థులకు ఒంటిపూట బడులు, తర్వాత వేసవి సెలవులు ఇవ్వడం ఆనవాయితీ. కానీ కూటమి సర్కారు ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యారంగంలో సంస్కరణలను తీసుకొచ్చింది. ఎవరితోనూ చర్చించకుండానే అకడమిక్ క్యాలెండర్ రూపొందించి మండు వేసవిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 1 నుంచి తరగతులను ప్రారంభించారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పలువురు విద్యార్థులు కళాశాలలకు రావడం లేదు. మరోవైపు కొత్త సంస్కరణలపై అవగాహన కల్పించకపోవడంతో పూర్తిగా అనాసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 44 ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం సుమారు 21 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో మరో 1.30 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఇప్పుడు రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ నెల 1 నుంచి క్లాసులను ప్రారంభించింది. పాఠ్యపుస్తకాలను కూడా పంపిణీ చేస్తోంది.

అరకొరగానే హాజరు

మండుతున్న ఎండలకు ఇంటర్ తరగతులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నామమాత్రంగానే హాజరవుతున్నారు. ప్రారంభం నుంచే విద్యార్థులు అరకొరగా మాత్రమే వస్తున్నారు. కాకినాడ పిఆర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 350 మంది ఉండగా 100 మంది లోపే హాజరవుతున్నారు. పిఠాపురం ఆర్ఆర్ బిహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో 330 మంది ఉండగా 80 మంది లోపే తరగతులకు వస్తున్న పరిస్థితి ఏర్పడింది. విద్యా రంగంలో సంస్కరణలు పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదు. ఏటా వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తుంటారు. కానీ తాజాగా విద్యా క్యాలెండర్‌తో ఇటీవల పరీక్షలు రాసి వేసవి సెలవుల మూడ్ లోకి వెళ్లిన విద్యార్థులను కాలేజీలకు రండి అని కబురు పంపినా, వారి నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. అంతేకాక వరుసగా ఉగాది, రంజాన్ పండుగలు జరుపుకుని వెనువెంటనే కళాశాలలకు వచ్చేందుకు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ముందస్తు ఎలాంటి కసరత్తు, క్షేత్రస్థాయి ప్రణాళిక లేకుండా ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభం, 7వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు అంటూ అయోమయానికి గురి చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తి చెందుతున్నారు.

పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అరకొరగానే హాజరైన విద్యార్థులు

కార్పొరేట్‌కు సర్కారు వత్తాసు

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలలకు అనుకూలంగా ఈ నెల 1 నుంచి ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోసం కాక కార్పొరేట్ కాలేజీలకు అనుకూలంగా ప్రతి సంవత్సరం సమ్మర్ క్లాసులు పేరు చెప్పి నిర్వహించుకునేదానికి ప్రభుత్వమే ముందుండి జిఒలు ఇవ్వడంపై తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీన పరీక్షలు పూర్తవగా ఇంకా ఫలితాలు రాకుండానే 7 నుంచి అడ్మిషన్ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు చేసుకోవడానికి ప్రభుత్వమే అవకాశం ఇచ్చినట్లుగా ఉందని ఆరోపిస్తున్నారు.

విద్యార్థుల సమస్యలు పట్టవా..?

రాష్ట్ర ప్రభుత్వానికి కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై ఉన్న మక్కువ ఈ జిఒ ద్వారా అర్థమవుతోంది. ఒకపక్క వాతావరణ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంవత్సరం విపరీతంగా ఎండలు ఉంటాయని హెచ్చరిస్తోంది. అటువంటి పరిస్థితుల్లో జూనియర్ కళాశాల ప్రారంభించడం సరికాదు. పదో తరగతి ఫలితాలు రాకుండానే ఇంటర్మీడియట్‌లో ఏ విధంగా చేర్చుకుంటారో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. విద్యా వ్యవస్థను మొత్తం ప్రైవేట్, కార్పొరేట్‌లకు అప్పజెప్పడం కోసమే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

- ఎం.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ.

ఎండలకు ఇబ్బంది పడుతున్నాము

ప్రస్తుతం ఎండలు బాగా ముదిరిపోయాయి. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం నుంచి తరగతులు వెంటనే ప్రారంభించడం ఇబ్బందిగా ఉంది. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పునరాలోచించి వేసవి సెలవులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

- బి.లక్ష్మీనారాయణ, ఇంటర్ రెండో సంవత్సరం, పిఠాపురం.

ఒంటి పూట మాత్రమే నడపాలి

వేసవికాలంలో అకడమిక్ ఇయర్ ప్రారంభంలోనే తరగతులు పెట్టడం వల్ల ఏకాగ్రతను కోల్పోయే అవకాశం ఉంది. సెలవులు లేకపోతే ఎలా.? ప్రభుత్వం కనీసం ఒంటి పూట తరగతులైనా నిర్వహించాలి.

- వి.వరలక్ష్మి, సెకండ్ ఇయర్.

రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిదీ

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

ఆరుగాలం శ్రమించి, పండించిన వరి పంటను రైతులు తమకిష్టమైన రైస్ మిల్లులో అమ్ముకోవచ్చని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. శనివారం మండలంలోని మోర్త గ్రామంలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి రైతు కళ్లల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. దానికి కారణం గత ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రైతులను మోసం చేయడంతో ఇప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతు సంక్షేమాన్ని కోరే ప్రభుత్వం గనుక రైతుల వద్ద నుండి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గోనె సంచుల కొరత లేకుండా, రైతుకు ఎటువంటి కష్టం లేకుండా, అన్నం పెట్టే రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో మొట్టమొదటి కొనుగోలు కేంద్రం మండలంలోనే ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. అమ్మకానికి వచ్చిన ధాన్యంలో తేమశాతం ఒక శాతం అటు, ఇటు ఉన్నా కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు ఒకవేళ తమ ధాన్యాన్ని బయట మిల్లులకు అమ్ముకోవాలనుకుంటే తమకిష్టమైన రైస్ మిల్లులో అమ్ముకోవచ్చని తెలిపారు. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సాంకేతికతను ప్రవేశపెట్టడంలో ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. తద్వారా రైతులకు ఎటువంటి సమస్య ఎదురైనా, పరిష్కారం కోసం తమ స్మార్ట్ ఫోన్లో, వాట్సాప్ నుంచి 7337359375 నెంబరుకు సమాచారం అందిస్తే, వెంటనే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. తొలుత వరి కంకులతో కూడిన బొకేను ఆర్డిఒ, మంత్రికి అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పూజ కార్యక్రమాల తర్వాత, కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ధాన్యం ట్రాక్టర్ను జెండా ఊపి ప్రారంభించి, ట్రాక్టర్ నడిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

తేమ కొలిచే యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిరాశలో రుణాల దరఖాస్తుదారులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని బిసి, కాపు, ఇబిసి తరగతుల వారికి సంబంధించి, వివిధ రకాల రుణాల నిమిత్తం 889 మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు వారందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు శనివారం తెలిపారు. వీరిలో 750 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇంతవరకు బాగానే ఉంది. రుణాలకు దరఖాస్తులు స్వీకరించబడటం మొదలు పెట్టిన మొదటి నాటి నుండి, మీ సేవ దుకాణాలు, జిరాక్స్ షాపులు దరఖాస్తుదారులతో కిటకిటలాడాయి. ఎవరికివారు అప్లికేషన్ పెట్టుకుంటే ప్రభుత్వం అందించే రుణం మంజూరు అయిపోతుందన్న ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. చివరికి తేలింది ఏమిటంటే మండల వ్యాప్తంగా మొత్తం 78 రుణాలే మంజూరు అవుతాయని ఆలస్యంగా తెలిసింది. అంటే ఒక లోనుకు వందమంది దరఖాస్తు చేసుకున్నట్లు అయ్యింది. దీంతో దరఖాస్తుదారులు ఒకింత నిరాశకు లోనయ్యారు. ఈ మాత్రం దానికి ఇంత హడావుడి ఎందుకు చేశామనుకుంటూ వారు నీరసపడ్డారు. ఒక వైపు ప్రభుత్వం వైపు నుండి అర్హత గల వారిని ఎంపిక చేసినప్పటికీ బ్యాంకర్లు మాత్రం తమ రూల్స్ ప్రకారం సిబిల్ స్కోర్ చూసి, లావాదేవీలు బాగున్న వారికి మాత్రమే రుణాలు మంజూరు అవుతాయని చెప్పడంతో చివరికి ఎంతమందికి రుణాలు లభిస్తాయోనని అర్జీదారులలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలలో బ్యాంకుల ప్రతినిధులు, ఇఒపిఆర్‌డి కె.ఆంజనేయ శర్మ, పంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రవీణ్‌ది హత్యా? ప్రమాదమా? వెల్లడించాలి'

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పాస్టర్ ప్రవీణ్‌ది హత్యా, ప్రమాదమా అన్నది ప్రభుత్వం త్వరగా తేల్చి చెప్పాలని అమలాపురం మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలోని సమావేశపు హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హర్షకుమార్ మాట్లాడుతూ ప్రవీణ్ మరణించి నేటికి 14 రోజులు పూర్తయ్యాయని, ఇప్పటికీ రిపోర్టును వెల్లడిరచకుండా జాప్యం చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రవీణ్ మృతిలో అనేక సందేహాలు ఉన్నాయన్నారు. పోస్టుమార్టం రిపోర్టు వెల్లడిస్తే అందులో ఏమైనా తేడా వస్తే తాను ఎక్కడ కోర్టుకు వెళతానోననే భయంతోనే పోస్టుమార్టం రిపోర్టు వెల్లడించడం లేదన్నారు. ఎపి పోలీసులపై ప్రవీణ్ భార్యకు నమ్మకం ఉంటే ఉండొచ్చని తమకు మాత్రం నమ్మకం లేదన్నారు. ప్రవీణ్ కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. తనపై కేసులు పెడుతున్న పోలీసులు ఫేక్ వీడియోలు విడుదల చేస్తున్న ఆ వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు అన్నీ కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టాన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతదేహానికి రీపోస్టుమార్టం చేయాలని కోరితే తనపై బిఎన్ఎస్ 196, 197 సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారన్నారు. రీ పోస్టుమార్టంకు ఎన్ఒసి అడుగుతూ తాను పెట్టుకున్న విజ్ఞాపనకు కలెక్టర్ నుంచి ఎక్నాలెడ్జ్‌మెంట్ వచ్చిందని, ఎస్‌పి నుంచి ఇంకా రాలేదని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో శనివారం ఎంఎల్ఎ బత్తుల బలరామ కృష్ణ, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణ నాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి చిన్న రాముడు మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడానికి కృషి చేస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్ముకోవచ్చని సూచించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఆర్‌డిఒ కృష్ణ నాయక్ మాట్లాడుతూ, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం చినకొండేపూడి, చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా సాయం చేయడానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఎంఎల్ఎ బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడానికి కృషి చేస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అమ్ముకోవచ్చని సూచించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడం వల్ల చినకొండేపూడి, చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ, జెసి

దుళ్లలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామపంచాయతీలో శనివారం మండపేట నారాయణరెడ్డి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కడియం మండల తెలుగు యువత అధ్యక్షులు, స్థానిక నాయకుడు ముమ్మిడిదేవి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో స్త్రీలు, గర్భిణులకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలూ, బిపి, థైరాయిడ్, సుగర్, కాళ్ల నొప్పులు తదితర పేషెంట్లకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకుడు ముమ్మిడిదేవి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి శ్రీనివాస్, తూము శ్రీను, కురుపాకల సత్యనారాయణ, సాయి, పాల్గొన్నారు.

'గట్టి' సోదరులకు వేణు పరామర్శ

ప్రజాశక్తి-కడియం

పితృ వియోగంతో బాధపడుతున్న గట్టి సుబ్బారావు, నర్సయ్య సోదరులను మాజీమంత్రి చెల్లుబోయిన వేణు శనివారం పరామర్శించారు. గట్టి సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తితో తనకున్న అనుబంధాన్ని వేణు గుర్తు చేసుకున్నారు. గట్టి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, గ్రామ మాజీ సర్పంచ్ పుల్లా రామారావు, నక్కా రాజబాబు, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను, సాపిరెడ్డి సూరిబాబు, రత్నం కృష్ణ, సాధనాల బాబ్జి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

భరత్ కుమార్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి-గోకవరం

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అడపా భరత్ కుమార్‌కు జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ప్రకటించడంతో శనివారం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు కామరాజుపేటలో అడపా భారత్ కుమార్ స్వగృహంలో ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘ సేవలందించిన అడపా భరత్ కుమార్‌కు జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దక్కడం ఎంతో సంతోషం అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించడంలో స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ప్రత్యేక చొరవ తీసుకుంటారని తెలిపారు. సిద్ధ చంటి, మండల ఉపాధ్యక్షులు మండిగ బాలాజీ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అల్లాడ అరుణ, కొంగరపు రాజు, అండు బోయిన గోవిందు, మేడిరాజు, గొర్రెపూడి సూర్య ప్రకాశ్రావు, తేజ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం గొప్పది

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాల, రాజమహేంద్రవరం విద్యార్థులు RAWEP ప్రోగ్రామ్‌లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమం రెండో రోజు కోరుకొండ మండలం, శ్రీరంగపట్నంలో ఆరోగ్య శిబిరం కార్యక్రమం చేపట్టారు. కో ఆపరేటివ్ బ్లడ్ డోనర్స్ సహకారంతో రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం, ఉచిత దంత వైద్య శబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానంతో ఎన్నో జీవితాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలో వృద్ధులు, పిల్లలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తమ ఆరోగ్య పరిస్థితిపై అవగాహన పెంచుకోవచ్చని చెప్పారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ విజయకృష్ణ మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.సునీత, డాక్టర్ హెచ్.శ్రీనివాస్, డాక్టర్ బి.సంతోష్, ఎన్.వర్ధమాన్, డి.సత్యనారాయణ, డాక్టర్ డి.చిన్ని పాల్గొన్నారు. వ్యవసాయ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. గ్రామ ప్రజలు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ, జెసి

కార్టూ'నిజం'



ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం స్థానిక జామ్ పేట చర్చి సెంటర్‌లో ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసు, ఎస్‌పి నరసింహా కిషోర్, జెసి చిన్న రాముడు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు ఆకాంక్షించే వ్యక్తిగా జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనసాగిస్తూ, ఆదర్శంగా నిలవాలని పిలుపు ఇచ్చారు. సంఘం కోసం ఆలోచించండి, సామాజిక న్యాయం జరగాలన్న ఆయన ఆశయాలను పుణికి పుచ్చుకోవాల్సి ఉందన్నారు. సమాజంలో అసమానతలు ఉండరాదు, రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధి, సామాజిక అసమానతులు అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దేశ నిర్మాణ క్రమంలో, సంఘాల ఔన్నత్యానికి తగిన గుర్తింపు ఇవ్వడంలో ఆయన చేసిన కృషి నిరుపమానమన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్.శోభారాణి, జి.కోటయ్య, వెంట్రపాటి వీర్రాజు, రెడ్డి మానేశ్వరరావు, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దొండపాటి క్రిష్టఫర్ పాల్గొన్నారు.

చాగల్లు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించినట్టు ఇఒపిఆర్‌డి ఆర్.శ్రావణ్ కుమార్ తెలిపారు. ఊనగట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో క్లాప్ మిత్రలకు తుండ్లు, సబ్బులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్టా వెంకట్రావు పాల్గొన్నారు.

పెరవలి పిట్టలవేమవరం, కాకరపర్రు, కానూరు తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపిటిసి రాపాక ప్రమీల, చిర్ర రాజు, గంగోలు జోసెఫ్, విఆర్ఒ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ సొంగరాజు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

ఉండ్రాజవరం ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో సర్పంచులు, వివిధ కమిటీల సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

కడియం కాంగ్రెస్ పార్టీ రూరల్ కో ఆర్డినేటర్ తాడాల కొండ్రాజు కడియం గ్రామం అరుంధతి పేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేవీసెంటర్ వద్ద కూటమి నాయకుల ఆధ్వర్యంలో, జేగురుపాడులో గ్రామ సర్పంచ్ సతీష్ చంద్ర స్టాలిన్, మాధవరాయుడుపాలెంలో సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో, దామిరెడ్డిపల్లిలో సర్పంచ్ ముద్రగడ సత్య స్వరూప జెమ్మి, దుళ్లలో ఆదర్శ రైతు కందరెడ్డి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తాళ్లపూడి మండలం పెద్దేవంలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆయన మనవడు డాక్టర్ అన్షుల్ అవిజిత్ ఆవిష్కరించారు. అవిజిత్‌కు పార్టీలకు అతీతంగా గ్రామాల్లోని నాయకులు యువకులు ఘన స్వాగతం పలికారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, తిగిరిపల్లి గోపి, గెడ్డం విజయభాస్కర్, సిర్రా గోపి, సిర్రా గంగారావు, ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి కెఎస్.జవహర్, మాజీ ఎంఎల్ఎ టివి.రామారావు, సర్పంచ్ టి.వెంకట్రావు, నన్నయ్య యూనివర్సిటీ మాజీ విసి జార్జి విక్టర్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. వైసిపి కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు తాళ్లపూడి మండలం పైడిమెట్ట జంక్షన్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద యూత్ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులతో పాటు ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దారు భారతి ఆధ్వర్యంలో జగజ్జీవన్ రావ్ జయంతి వేడుకలు నిర్వహించారు. గజ్జరం, మలకపల్లి, పెద్దేవం తదితర గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గోకవరం రంపఎర్రంపాలెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బాదంపూడి ప్రకాష్, గ్రామ సెక్రటరీ అప్పన గోవింద్, దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సెక్రటరీ అప్పన గోవింద్, బాదంపూడి ప్రకాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ లంక అప్పారావు, పోలవరం ప్రాజెక్టు ఇంజనీర్ తాతపూడి గంగరాజు, గంధం బుజ్జి, వెంకటేష్, అప్పారావు, వరం, హేమంత్, బుజ్జేష్, సాత్విక్, రాజు, వంశీ పాల్గొన్నారు.

నల్లజర్ల మండలంలో అన్ని గ్రామాల్లోనూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలికిచర్లలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ఆవిష్కరించారు. అనంతరం చీపురుగూడెం మారలేమడి సింగరాజుపాలెం గ్రామాల్లో విగ్రహాలకి పూలదండలు వేసి ఎంఎల్ఎ నివాళులు అర్పించారు. ఎఎంసి ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, కండిపు వెంకటరత్నం, సుంకర రామకృష్ణ, వీరమల్ల అనిల్ కుమార్, పెనుమాక లలిత, తాతిన సత్యనారాయణ, గద్దె రవీంద్ర, వాకాల అంజి, బండి చిట్టి, వల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు. నల్లజర్ల, చీపురుగూడెం, మారెళ్ళమూడి, తెలికిచెర్ల గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు మాజీ హోమ్ మంత్రి తానేటి వనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంకిపాటి సువర్ణ రాజు, కంకిపాటి కంబయ్య, నక్కా సత్తిపండు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఆయన మనవడు అన్షుల్

నేరాలు ఘోరాలు

కేదార్లంకలో గల్లంతయిన దుర్గాప్రసాద్ మృతదేహం

స్నానానికి దిగి యువకుని మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గోదావరి నదిలో స్నానానికి దిగిన యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో శనివారం చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తపేట మార్కెట్ వీధికి చెందిన రొట్టా దుర్గాప్రసాద్ (22). మరో 4 గురు స్నేహితులతో కలిసి కేదార్లంక ఇసుక ర్యాంపు సమీపంలో గోదావరి నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు నదిలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమయ్యింది. ఈ ప్రమాదం నుంచి నలుగురు బయటపడ్డారు. కేదార్లంక ర్యాంప్ వద్ద ఇసుక తవ్వేయడం వల్ల ఏర్పడిన గుంతల్లో గల్లంతయ్యి చనిపోయాడని ఆరోపిస్తూ కొత్తపేటకు చెందిన కుటుంబీకులు బంధువులు మృతదేహం వద్ద ధర్నా నిర్వహించారు. ఇసుక ర్యాంపు గుంతల కారణంగా చనిపోయిన దుర్గాప్రసాద్ కుటుంబానికి న్యాయం జరగాలంటూ నినాదాలు చేశారు. సంఘటనా స్థలాన్ని మండపేట సిఐ దొర రాజు , అంగర ఎస్ఐ రవికుమార్, గ్రామ విఆర్ఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ధర్నా చేస్తున్న బాధిత కుటుంబీకులు, బంధువులతో చర్చలు జరుపుతున్నారు.

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గడ్డి ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. శనివారం మధ్యాహ్నం ఉప్పాడ నుంచి కాకినాడ వైపు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను ఎస్‌పిజిఎల్ శివారులో వెనక నుంచి వస్తున్న లారీ ట్రాక్టర్‌ను తప్పించబోయి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఉప్పాడ బీచ్ రోడ్డులో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సైనిక విన్యాసాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ భారత్, అమెరికా వాయుసేనా దళాలు ఉమ్మడిగా నిర్వహించనున్న టైగర్ ట్రియంఫ్-2025 సైనిక విన్యాసాల ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి బిందుమాధవ్ పరిశీలించారు. శనివారం రూరల్ మండలంలోని సముద్ర తీరంలో స్టేట్ హైవే బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు, క్రౌడ్ నియంత్రణ, సైనిక విన్యాసాలు దృష్యా ప్రవేశ అనుమతి ఉండని నో పబ్లిక్ జోన్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రియంఫ్-25 కార్యక్రమాన్ని విజయవంతానికి కృషి చేయాలన్నారు. భారత్, అమెరికా వాయుసేనల సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నం, కాకినాడ తీరంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సైనిక విన్యాసాలు సక్రమంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో ట్రైనీ ఐపిఎస్ సుస్మిత, డిఆర్ఓ జె.వెంకటరావు, సివిల్-మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వైకె.కిషోర్, సైనిక అధికారులు టివివి.ప్రసాద్, డిపిఒ వి.రవికుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి పివిఎస్ రాజేష్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీ, మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్య సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక బొజ్జ వారి తోటలో లిటిల్ స్టార్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, లిట్రిసి ఇండియా ట్రస్ట్ - చెన్నై ఆధ్వర్యంలో శనివారం వయోజన విద్యా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ టి.కామేశ్వర రావు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో రౌతులపూడి, ముమ్మిడివరం, జగపతిరాజపురం, నేమాం, పిఠాపురం తదితర ప్రాంతాల్లో 15 వయోజన విద్యా సెంటర్స్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ వయోజన విద్యా సెంటర్ల ద్వారా సులభమైన పద్ధతిలో విద్యను నేర్పించడమే కాక స్త్రీలకు చేతివృత్తులపై శిక్షణ, ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. లిట్రిసి ఇండియా ట్రస్ట్ - ఆధ్వర్యంలో వయోజన విద్యకు సంబంధించిన పుస్తకాలు, పలకులు, బ్లాక్ బోర్డ్, ఛార్జింగ్ లైట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.రాధ, కెవిపి.ప్రసాద్ కె.అప్పారావు, కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, జనతా ఫౌండేషన్ అధ్యక్షులు జమ్ము, బి.నానిబాబు, టి.బ్యూలాగ్రేస్, టి.కృపారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణకు పాటుపడదాం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని కోరింగ వన్యప్రాణి అభయారణ్యం ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ అన్నారు. శనివారం ఎపి నేషనల్ గ్రీన్ కోర్, ఎపి అటవీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో కోరంగి అభయారణ్యంలో నేచర్ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి నడక, పక్షుల పరిశీలన, మొక్కలు, జంతువులపై అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటానికి నీటిని పొదుపు చేయాలని, చెట్లను నాటాలని, వ్యర్థాలను తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ప్రముఖ పప్పెట్రి శిక్షకులు పిల్లి గోవిందరాజు మాట్లా డారు. అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఎస్.తిమ్మాపురం గ్రామంలో పశువుల కోసం నిర్మిస్తున్న నీటి తొట్టికి సర్పంచ్ మందేటి వీరలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నామసాని వాసు, కానూరి కాసులు, సోము నారాయణరావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.

నాగాంజలి, ప్రవీణ్ మరణాలతో ఉత్కంఠ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నమ్మినవాడే నయవంచకుడై ఓ ఫార్మా విద్యార్థిని బలగొన్న ఉదంతం జిల్లా ప్రజలను కలచి వేసింది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాగాంజలి 12 రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఈ నెల 4న తుదిశ్వాస విడిచింది. నాగాంజలి మృతి, అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగిన పోస్టు మార్టం, ఆపై మృతదేహం ఆమె సొంత ఊరికి తరలింపు వంటి పరిణామాలు అత్యంత నాటకీయంగా జరిగాయి. మృతదేహాన్ని తరలించే క్రమంలో విద్యార్థి, ప్రజా సంఘాలు ఆందోళనకు చేసిన ప్రయత్నాలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన కారులను చెదరగొట్టి అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించిడంపై సర్వత్రా విమర్శలు వినిపించాయి. కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో మెడికల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దీపక్ వేధింపుల వల్లే నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సూసైడ్ నోట్ ద్వారా బయటపడింది. దీంతో ఎట్టకేలకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. విబి 10 ఎంజి స్వయంగా చేసుకోలేరని ప్రభుత్వ వైద్యుల బృందం స్పష్టం చేసింది. ఈ ఇంజెక్షన్ తానే చేసుకుందా..? లేక మరెవరైనా చేశారా..? అనేది నేటికీ తేలలేదు. నాగాంజలి మరణం అనంతరం జిజిహెచ్‌కు తరలించటం, పోస్టు మార్టం పూర్తికాక మునుపే తల్లిదండ్రులను పంపించడం వంటి పరిణామాలపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లేదా రాజీమార్గం ద్వారా కేసును నీరుగార్చే ప్రయత్నం ఉందా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. పారదర్శకంగా విచారణ జరిపి ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగం ఉంది.

పత్తాలేని డిప్యూటీ సిఎం, హోం మంత్రి

ఆడపిల్లలను తరలించేస్తున్నారు... ఆడపిల్లలకు భద్రత కరువైంది... 30వేల మంది ఆచూకీ లేదు... అంటూ ఎన్నికల ముందు హడావుడి చేసిన జనసన అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నాగాంజలి ఘటనపై నోరు కూడా మెదపలేదు. బాధితురాలి తల్లిదండ్రులను కనీసం ఫోన్‌లో కూడా పరామర్శించిన దాఖలాలు లేవు. పిఠాపురం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆయన ఈ ఘటనపై కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన చోటు చేసుకున్న 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న హోం మంత్రి అనిత కూడా కనీసం నాగాంజలిని పరామర్శించడానికి రాలేదు. ఈ ఘటనపై విద్యార్థులు రోడ్డెకినా పెదవి విప్పన దాఖలాలు లేవు. ప్రజాప్రతినిధులుగా ఉండి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన ఇలాంటి సమయాల్లోనూ కనీసం పరామర్శించకపోవడం మహిళల రక్షణ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటితో అర్థమవుతుంది.

పాస్టర్ మృతిపై ఆగని ఆందోళనలు

పాస్టర్ ప్రవీణ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై క్రైస్తవ సంఘాలు భగ్గుమంటున్నాయి. క్రైస్తవ మత ప్రచారకుడు ప్రవీణ్ ప్రగడాల అనుమానాస్పద మృతి యావత్ ప్రజానికాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసిన విషయం విధితమే. పాస్టర్ ప్రవీణ్ మద్యం సేవించి వాహనం నడపటంతో సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యారంటూ సోషల్ మీడియాలో ఓ వర్గం

విస్తృతంగా ప్రచారం చేస్తుంది. అంతే ధీటుగా క్రైస్తవ సంఘాలు స్పందిస్తున్నాయి. అదే సోషల్ మీడియా వేదికంగా ఈ ప్రచారాన్ని కొట్టిపడేస్తూ తమదైన శైలిలో యువత విశ్లేషణలు ఇస్తున్నారు. ఇలా అభిప్రాయం వ్యక్తం పరిచిన వారిపైనా కేసులు నమోదుకు పోలీసులు చర్యలకు ఉపక్రమించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.అదే విధంగా క్రైస్తవ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఈ వారంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో వేలాదిగా పాల్గొని తమ మద్దతు తెలిపారు. అయితే పోలీసులు ఇప్పటికీ ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. పాస్టర్ ప్రవీణ్ మృతదేహం ముఖం, చేతులపై గాయాలు ఉన్నాయని పోస్టుమార్టం ప్రాథమిక రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. ఇటువంటి సున్నిత మైన అంశాన్ని ఎటువంటి అపోహలకు దారి తీయకుండా క్రైస్తవ సమాజానికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఈ నేపథ్యంలో తుది రిపోర్టుకు ప్రాధాన్యత సంతరించుకుంది.

వక్ఫ్ బిల్లు సవరణపై ముస్లిం సంఘాల భగ్గు

కేంద్రం ప్రభుత్వ తీసుకొచ్చి వక్ఫ్ బిల్లు సవరణలపై ముస్లిం సంఘాలు భగ్గుమంటున్నాయి. పార్లమెంటులో ప్రతిపక్షాలు ఈ సవరణ బిల్లును వ్యతిరేకించినప్పటికీ ఎన్‌డిఎ సభ్యుల మెజారిటీతో ఆమోదం లభించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ముస్లిం సంఘాలు రోడెక్కాయి. తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలకు ప్రజాస్వామిక వాదులు, వామపక్ష పార్టీలు సైతం మద్దతు తెలిపాయి. అయితే రాష్ట్రంలోని టిడిపి, వైసిపి సభ్యులు పార్లమెంటులో ఈ బిల్లుకు ఎన్‌డిఎకు అనుకూలంగా ఓటేయటం విమర్శలకు దారి తీసింది. మరోసారి వారి ద్వంద వైఖరిని దర్పణం పట్టింది. రాష్ట్రంలో ఈ రెండు పార్టీల నేతలు నిత్యం ఒకరిపై ఒకరు విమర్శలకు పాల్పడుతున్న విషయం విధితమే. ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఈ సమావేశాల్లో కనీసం నోరు మెదిపిన దాఖలాలు లేవు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం బిజెపీకి అనుకూలంగా వక్ఫ్‌బిల్లుకు ఆమోదం తెలిపారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజాభిప్రాయాన్ని గౌరవించని ఈ మూడు పార్టీలు రాబోయేరోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే అభిప్రాయం సర్వత్ర వ్యక్తమవుతోంది.

ఆకట్టుకున్న అమరావతి చిత్రకళా ప్రదర్శన

అమరావతి చిత్రకళా ప్రదర్శన పేరుతో రాజమహేంద్రవరంలో చేపట్టిన కళా ప్రదర్శన ఆకట్టుకుంది. సాంస్కృతి రాజధానిగా పేరుగాంచిన నగరంలో మరోసారి కళాకారులు ఒకే వేదికపైకి వచ్చేందుకు సాంస్కృతి శాఖ చేసిన ప్రయత్నం కళాప్రియులకు కనువిందు చేసింది.

'వివేకానంద'లో ఆధునిక విజ్ఞానంతో బోధన

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని శ్రీ వివేకానంద స్కూల్ విలువలతో కూడిన విద్యను అందిస్తూ ఆధునిక విజ్ఞానాన్ని బోధిస్తూ విద్యార్థుల అభివద్ధికి ఎంతో కృషి చేస్తుందని మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్ వ్యాఖ్యానించారు. రామచంద్రపురం లోని శ్రీ వివేకానంద స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి విజయ ఫంక్షన్ హాల్ లో ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రసంగించారు. జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ నిబద్ధత గల ప్రణాళికతో శ్రీ వివేకానంద స్కూల్ కొనసాగుతుందని రామచంద్రపురం ప్రజలకు పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యాభవన సాగించటం గర్వకారణం అన్నారు. స్కూల్ కరస్పాండెంట్ బిఎఎస్.సరోజిని మాట్లాడుతూ ఇప్పటివరకు కాకినాడలో ఇంద్రపాలెం, మధుర నగర్, సామర్లకోట, రాయవరం, రామచంద్రపురంలో శ్రీ వివేకానంద స్కూల్ పనిచేస్తున్నాయన్నారు. ఈ ఏడాది నుంచి పసలపూడి లోని శ్రీ సిటీలోను ఆరో స్కూల్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో

విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలు(ఇన్‌సెట్)లో బహుమతి ప్రదానంచేస్తున్న కళాశాల కరస్పాండెంట్ బిఎఎస్.సరోజిని

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌సిఇఆర్‌టి సిలబస్, ఒలింపియాడ్, నీట్ కోర్సులను మూడవ తరగతి నుంచి 9వ తరగతి వరకు అందజేస్తున్నామన్నారు. దీంతోపాటుగా ఎసి క్యాంపస్, హాస్టల్ వసతి ప్లే స్కూల్ నిర్వహిస్తామని తెలిపారు. శ్రీ వివేకానందకు చేయూతనందిస్తున్న శ్రేయోభిలాషులకు విద్యార్థులకు తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో దేవి వివేకానంద స్కూల్ ఛైర్మన్ సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.శైలుష, అకాడమిక్ డీన్ శ్రీమతి వికాస తదితరులు పాల్గొన్నారు.

దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానంలో అమలు చేస్తున్న శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు మామిడికుదురు వాసులు గోకవరపు శ్రీరాములు అనంతలక్ష్మి దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు శనివారం తెలిపారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం నిర్వహించి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

బాల బాలాజీ స్వామిఆదాయం రూ.2.20లక్షలు

బాల బాలాజీ ఆలయానికి శనివారం వివిధ విభాగాల ద్వారా రూ.2,20,146 ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. ఇందులో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.25,116, నిత్యాన్నదానట్రస్ట్‌కు రూ.44,273 ఆదాయం సమకూరిందన్నారు. నాలుగు వేల మంది యాత్రికులు స్వామి వారిని దర్శనం చేసుకోగా, 2,500 మంది యాత్రికులు అన్నప్రసాదం స్వీకరించారన్నారు.

బాల బాలాజీ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి శనివారం బాల బాలాజీ ఆలయాన్ని ఆయన సందర్శించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జనసేన మండల అధ్యక్షుడు జాలెం శ్రీనివాస రాజా, ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపిపి ప్రసాద్

యువత సేవా భావంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి-కడియం

యువత సేవా భావంతో ముందుకెళ్లాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడియం దేవీచౌక్ సెంటర్లో జనసేన నాయకుడు మర్రి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ గత 13 ఏళ్ల గా తన మిత్రులతో కలిసి వేసవిలో ప్రతి ఏటా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి తాడాల కొండ్రాజు, ఐఎన్‌టియుసి అధ్యక్షుడు జెటి.రామారావు, నాయకులు ముద్రగడ జెమ్మి, గెడ్డం శివ, వెలుగుబంటి నాని, తోరాటి వసంత రావు, తమ్మిశెట్టి ప్రసాద్, కల్యాణపు సూరిబాబు, మర్రి సుబ్రహ్మణ్యం, జల్లి కృపారావు తదితరులు ఉన్నారు.

ఎంఎల్‌సి నాగబాబును కలిసిన సందీప్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎంఎల్‌సి గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా పిఠాపురం వచ్చిన కొణిదల నాగబాబును శనివారం మండలానికి చెందిన జనసేన పార్టీకి చెందిన కడియం సందీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎం ఎల్ సి నాగబాబుకు సందీప్ దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంఎల్‌సి నాగబాబు తనకు సూచించారని సందీప్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చాగల్లు

సురేష్ స్టూడియో సురేష్ షాపు దగ్గర చాగల్లులోని మెయిన్ రోడ్‌లో శనివారం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. చాగల్లు ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు అందరూ కలిసి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు సురేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ గల్లా రాజు, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుమార్ బాబు, వీరబాబు, పవన్, ప్రసాద్, షరీఫ్, బొమ్మల బాలు పాల్గొన్నారు.

11న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో ఈనెల 11న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బిటెక్, పీజీ చేసిన 35 సంవత్సరాల వయసు మించని అభ్యర్థులు పాల్గొనవచ్చునని తెలపారు.

7వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

ఎపి రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోనేటి రాజు మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో కృష్ణా జిల్లా కొండపల్లిలో సంఘం రాష్ట్ర మహాసభలు జరుగు తాయని, మహాసభల జయ ప్రదాకికి వృత్తిదారులంతా కృషి చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర మహాసభల బ్రోచర్ ఆవిష్కరించారు. సమావేశంలో కోజ్జవరపు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

7న రుణాల కోసం ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసే రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూలను ఈ నెల 7న నిర్వహించినున్నట్లు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే ఇంటర్వ్యూలలో మండల పరిధిలోని జి.రాగంపేట, పులిమేరు, దివిలి, తిరుపతి, తూర్పుపాకలు, చంద్రమాంపల్లి, గుడివాడ, ఉలిమేశ్వరం మర్లావ, కట్టమూరు, కాండ్రకోట గ్రామాలకు సంబంధించిన దరఖాస్తుదారులు హాజరు కావాలన్నారు.

ద్రాక్షారామం-రామచంద్రపురం రహదారిలో కురిసిన వర్షం

చిరుజల్లులతో చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి - రామచంద్రపురం

వేసవి ఎండలతో అల్లాడుతున్న జనానికి శనివారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో సేద తీరారు ప్రతీ రోజు 36 డిగ్రీల పైగా నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలతో సతమత మవుతున్న సామాన్యులకు ఈ వర్షం తో ఉపశమనం లభించింది.వాతావరణం చల్ల బడటంతో పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మరో వైపు రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

వెంకన్న ఆలయంలో సౌకర్యాల పరిశీలన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పరిసరాలను, యాత్రికుల సౌకర్యాలను శనివారం కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి. శ్రీకర్ పరిశీలించారు. శనివారం సెలవు దినం కావడంతో ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. ఉదయం వేకువ జామున స్వామివారి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులను దర్శనాలకు అనుమతించారు. యాత్రికుల రద్దీ రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. క్యూలైన్‌లో యాత్రికులకు శీతల పానీయాలు, మజ్జిగ, బిస్కెట్లు, పంపిణీ చేశారు. యాత్రికులకు ప్రసాదం పంపిణీ, భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు. కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి యాత్రికుల

ఆలయ అధికారుల వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ

సౌకర్యాల గురించి ఆలయ డిసి నల్లం చక్రధరావుకు పలు సూచనలు చేశారు.

పడిపోయినది

పెట్ల తరుణ్ కుమార్, హైదరాబాదులో గల టిసిఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వ్యక్తి, తన బైక్ మీద తన నల్లని బ్యాగులో నల్ల రంగు గల డెల్ కంపెనీ చెందిన లాప్టాప్ సీరియల్ నెంబర్ **D3B6563** గల దానిని తీసుకుని హైదరాబాద్ వెళుతుండగా తూ॥గో॥జిల్లా, దేవరపల్లి మండలంలో గౌరీపట్నం నుండి సూర్యనారాయణపురం మధ్యలో తన బ్యాగు కింద పడిపోయినట్లు ఎవరికైనా కనిపించిన ఎడల తన బ్యాగ్‌ను మరియు లాప్టాప్‌ను తీసుకొని వచ్చి ఇవ్వవలసిందిగా తెలియజేయడమైనది. ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

పెట్ల తరుణ్‌కుమార్
S/o. శ్రీనివాసరావు,
సెల్: 7032322801

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. శనివారం స్థానిక బాలికల హాస్టల్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబుతో కలిసి ఆయన సందర్శించారు. తొలుత జగ్జీవన్‌రామ్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వసతి గృహంలో కల్పిస్తున్న సదుపా యాలు, భోజనం ఏర్పాట్లు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌కు అవసరమైన ఇన్వర్టర్, ఆర్ఓ ప్లాంట్, సిసి కెమెరాలను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ జెడి ఎస్ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, ఎఎస్‌డబ్ల్యూఒ వై.వాణి, వార్డెన్ సిహెచ్.ఉమాదేవి, సూపరింటెండెంట్ ఐ.శ్రీనివాస్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెద్దకాపు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాయవరపు వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల 15వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి శివారులో ఉన్న తక్షశిల ఇంగ్లీష్ మీడియం పాఠశాల 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కరస్పాండెంట్ తొండాపు రఘురాం ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు పలు సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రయివేటు పాఠశాలల అధ్యక్షులు డి శ్రీనివాస్, ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డి.సత్యనారాయణ, లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ డి.బీజు జోషన్. పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం. 12285/2002-ఎ16 తేది.04-04-2025

వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధీనములోని వివిధ షాపింగ్ కాంప్లెక్సులలో ఖాళీగా ఉన్న షాపు రూములు (జాబితాలో 8వ కాలము నందు చూపబడిన రిజర్వుడు కేటగిరి షాపులు మినహాయించి) స్వాధీనం చేయబడిన తేదీ నుండి లేదా నగరపాలక సంస్థ నిర్ణయించిన తేదీ లగాయితూ 3 సంవత్సరముల కాలమునకు నెలవారి అద్దె చెల్లించు ప్రాతిపదికపై అనుభవించు గుత్తుహక్కు వేలమును నగరపాలక సంస్థ కార్యాలయము నందు ది. 16-04-2025 తేదీ నుండి 19-04-2025 తేదీ వరకు నిర్వహించబడును.

వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు యిందుతో జతపర్చబడిన పట్టికలో చూపిన ప్రకారము ధరావత్తు సొమ్ము కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున డిమాండు డ్రాఫ్టు మరియు మూడు సంవత్సరముల కాలమునకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని ఆఫీసులో ది. 15-04-2025వ తేదీ సాయంత్రం గం॥ 5.00 లోపు దరఖాస్తు దాఖలు చేయవలెను. చెక్కులు స్వీకరింపబడవు. ఒక్కొక్క షాపునకు విడివిడిగా ధరావత్తు, బ్యాంకు గ్యారంటీ, ఆధార్ జిరాక్సులతో దరఖాస్తు దాఖలు చేయవలెను. దరఖాస్తు దాఖలు పరిచినవారిని మాత్రమే వేలమునకు అనుమతించబడును. వేలం కమిషనరు గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును. వేలములో పాల్గొనువారు నగరపాలక సంస్థకు ఏవిధమైన బకాయిలు వుండరాదు.

వేలములో ఖాయపరచిన అద్దెతో 3 నెలల సొమ్మును (జి.ఎస్.టి. అదనము) అడ్వాన్సుగా 7 దినములలోగా చెల్లించిన తదుపరి షాపు అప్పగించబడును. వేలములో ఖాయపరచిన అద్దెపై 18% జి.ఎస్.టి. తో ప్రతి నెల 10వ తారీఖు లోగా కలిపి చెల్లించవలెను. మొదటిసారి లీజు కాలము 3 సంవత్సరములు, తదుపరి ప్రతి 3 సంవత్సరములకు స్థాయీ సంఘము వారి ఆమోదమునకు లోబడి 33 1/3 శాతం పెంపుదల (లేదా) 10% మార్కెట్ విలువను సంవత్సరము అద్దెగా లేదా పరిసరాల ప్రాంతాలలోని షాపుల అద్దె విలువ ఏది అధికమో దానిపై అద్దె హెచ్చింపు నిబంధనపై లీజు పొడిగించబడును. లీజుకాలము గరిష్టముగా 25 సంవత్సరముల వరకు మాత్రమే పొడిగించబడును. తదుపరి షాపు నగరపాలక సంస్థకు విధిగా అప్పగించవలెను. వేలం ఖాయపరచుటకు లేదా తిరస్కరించుటకు కమిషనరు గారికి పూర్తి అధికారము కలదు. మరియు నగరపాలక సంస్థ విధించు అన్ని ఇతర షరతులకు లోబడి వేలము నందు పాల్గొనవలెను. నగరపాలక సంస్థ కార్యాలయములో రెవెన్యూ విభాగము నందు ఎ16 సీనియర్ అసిస్టెంట్ నుండి షాపులు, నెలవారీ అద్దె, చెల్లించవలసిన ధరావత్తు, దాఖలు చేయవలసిన బ్యాంకు గ్యారంటీ, వేలం నిర్వహించుచున్న తేదీ మొదలగు వివరములను పొందగలరని తెలియచేయడమైనది.

సం/- **కమిషనరు**
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం